

# ప్రేమ-కర్తవ్యం

విజయపురి నగరంలో శ్రీ రంగనాథస్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. దొంగలు స్వామివారి బంగారు కిరీటం ఎత్తుకునిపోయారు. మంత్రిద్వారా దొంగతనం వార్తవిని రాజు వీర పురుషదత్తుడు ఎంతో విచారించాడు. విజయ పురిలో ఎందరో ధనవంతులున్నారు. వారి జోలికి పోకుండా దొంగలు గుడిలో దొంగతనం చేయడ మేమిటి? అని ఆలోచించాడు. కారణం ఏమిటో ఎంతకీ పాలు పోలేదు. ఆలయంలో దొంగతనం జరగడం ఇదే మొదటిసారి.

దేవుడి బంగారు కిరీటం దొంగిలించిన దొంగల కోసం రాజభటులు తీవ్రంగా గాలిం చారు. కాని ప్రయోజనం లేకపోయింది.

తర్వాత కొన్ని రోజులకే బౌద్ధారామంలోని బుద్ధుని దంతం భద్రపరిచిన స్వర్ణపేటిక మాయ మైంది. ఈ వార్త విని మహారాణి, అంతఃపుర స్త్రీలు తీవ్రమైన ఆందోళన చెందారు. ఆమె మహారాజుని కలుసుకుని ఎలాగైనా దొంగలను పట్టుకుని బుద్ధుని దంత పేటికను తిరిగి సంపా దించమని కోరింది. ఆ రోజులలో ఇక్ష్వాకు వంశ రాజులు హిందూమతాన్ని అభిమానిస్తే, రాణులు బౌద్ధమతాన్ని అభిమానించేవారు.

శ్రీరంగనాధుని కిరీటం పోతే మళ్ళీ బంగారంతో చేయించగలిగాడు రాజు. కాని పోయిన బుద్ధుని దంతం అమూల్యమైనది. అది తిరిగి సంపాదించాలేతప్ప ఎంత బంగారంతో నైనా చేయించేది కాదు.

వీరపురుషదత్తుడు విజయపురి ప్రజలకు బుద్ధుని దంతపేటిక దొంగిలించిన విషయం చాటింపుద్వారా తెలియజేస్తూ నగరంలో కొత్త

కథా నిలయం
5069

రాజీశ్రీ

వారెవరైనా కనిపిస్తే వెంటనే రాజభటులకు సమాచారం అందజేయవలసిందిగా కోరాడు.

మర్నాడు ఉదయమే మహారాజుని ఏకాంతంగా కలుసుకో గోరుతూ కాంతిమతి అనే వృద్ధ స్త్రీ కోటకు వచ్చింది. వీరపురుషదత్తుడు ఆమెకు దర్శనమిచ్చాడు.

"మహారాజా బుద్ధదేవుని దంతపేటిక అపహరించిన దొంగ నాకు తెలుసు," అంది కాంతిమతి.

ఆ వార్తవిని మహారాజు ఎంతో ఆనందించి, "అమ్మా! అతడెవరో చెప్పు! స్వర్ణ దంతపేటిక దొరికితే నీకు మంచి బహుమతి ఇస్తాను," అన్నాడు.

"మహారాజా! నేను బహుమతి ఆశించి రాలేదు. దొంగ ఎవరో తెలిసినప్పుడు పాలకులైన మీకు తెలియజేయడం నా కర్తవ్యం అని భావించి వచ్చాను" అంటూ కాంతిమతి దొంగ ఉనికి తెలియజేసి వెళ్ళిపోయింది.

ఆమె చెప్పిన ప్రకారం వీరపురుషదత్తుడు సైన్యాధికారిని స్వయంగా పంపి దొంగను బంధించాడు.

ఆ దొంగపేరు చారుదత్తుడు. అతను యువకుడు. విద్యాధికుడు. పైగా విజయపురి నగర నివాసి కూడా. చారుదత్తుణ్ణి సభలో ప్రవేశపెట్టారు. అతని గురించి వివరాలు తెలుసుకుని మహారాజు ఆశ్చర్యపోయాడు.

"చారుదత్తా! నువ్వు విద్యాధికుడవు. నీవంటి జ్ఞాని గుడిలోను, ఆరామాలలోను దొంగిలించడం తగునా? నీవింత నీచానికి ఎందుకు దిగజారావు?" అని ప్రశ్నించాడు.



"మహారాజా! నేను వృత్తిచేత దొంగను కాదు, నా పరిస్థితులు దొంగతనానికి పురికొల్పాయి." అన్నాడు చారుదత్తుడు.

"ఏమిటి నీ పరిస్థితులు?"

"నాకు తండ్రిలేదు, ఆస్తిలేదు. నాతల్లి ఎన్నో కష్టాలకు ఓర్చి చదువు చెప్పించింది. కాని నా విద్యకు గుర్తింపులేదు. ఆస్థానంలో ఉద్యోగులు వయోవృద్ధులైనా పదవులలో కొనసాగుతూనే వున్నారు. అధికారులు యువకుల గోడు పట్టించుకోవడంలేదు. రోజు రోజుకూ యువకులలో నిరుత్సాహం పెరిగిపోతూంది," అంటూ చారుదత్తుడు తనను దొంగతనానికి దారితీసిన వైనమంతా వివరంగా చెప్పాడు.

"నగరంలో ఎందరో ధనవంతులు వున్నారు

గదా? నువ్వు గుడిలోనే ఎందుకు దొంగతనాలు చేస్తున్నావు?" అంటూ తన సందేహం వెలిబుచ్చాడు మహారాజు.

"మహారాజా! వ్యక్తికి నష్టం కలిగితే ఎవరూ పూడ్చరు. దేవుడికి నష్టం కలిగితే ప్రజలూ, రాజు కూడా ఆ నష్టాన్ని భర్తీచేస్తారు. అందుకే నేను గుళ్ళను ఎన్నుకున్నాను," అన్నాడు చారుదత్తుడు.

చారుదత్తుడు చెప్పిన విషయాలు ఎంతో తీవ్రమైనవిగానే భావించాడు మహారాజు. మంత్రితోను, అధికారులతోను చర్చలు జరిపి వయో వృద్ధులను ఉద్యోగాలలో నుంచి తొలగించి, యువకులను ఆ ఖాళీలలో నియమించడానికి వెంటనే చర్యలు తీసుకున్నాడు.

చారుదత్తుడు వృత్తిచేత దొంగ కాకపోయినా, సహజమైన ఆవేశంతో చేసిన పొరపాటుగా భావించి చారుదత్తుడికి నూరు వరహాలు జరిమానా మాత్రం విధించాడు రాజు.

చారుదత్తుడి తల్లి నూరు వరహాలు చెల్లించి కొడుకుని విడిపించుకుంది. రాజు ఆమెను గుర్తించి ఆశ్చర్యపోయాడు. ఆమె దొంగ ఆచూకి తెలియజేసిన కాంతిమతి!

"అమ్మా! నీ కొడుకే దొంగని తెలిసి నాకు అతని ఆచూకి తెలిపావు. మళ్ళీ ఆ దొంగని జరిమానా కట్టి ఎందుకు విడిపించుకుంటున్నావు? అని ప్రశ్నించాడు రాజు.

"మహారాజా! అది నా కర్తవ్యం. అందుకే పట్టిచ్చాను. కొడుకు దొంగతనం చేసినంత మాత్రాన పుత్ర ప్రేమ నశించదు. అందుకే యిప్పుడు జరిమానా కట్టి విడిపించుకున్నాను ఉత్తమపౌరులు నీతి నిజాయితీలకు దూరం కాకుండా తగిన చర్యలు తీసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాను ప్రభూ!" అంది కాంతిమతి.

రాజు, ఆమెకున్న పుత్ర ప్రేమకూ, అదే సమయంలో ఆమె చూపిన కర్తవ్యానికీ ముగ్ధుడయ్యాడు. విద్యాధికుడైన చారుదత్తుడికి తన ఆస్థానంలో ఉద్యోగం యిచ్చాడు. అంతేకాక అటుపైన ఉత్తమపౌరులు నీతి నిజాయితీలకు దూరం కాకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

